రహదారికి మార్పులెన్నో..



ఎన్‌హెచ్‌ఏఐ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న బాధితులు (ఫైల్)

- ఎన్‌హెచ్-63 రహదారి నిర్మాణంలో మార్పు
- విలువైన భూముల నుంచి రోడ్డు మార్గం
- ఒత్తిళ్లకు తలొగ్గిన అధికార యంత్రాంగం
- వారంలో నోటిఫికేషన్‌కు రంగం సిద్ధం
- ఎన్‌హెచ్‌ఏఐ అధికారుల తీరుపై విమర్శలు
- నేషనల్ హైవే కార్యాలయం ఎదుట బాధితుల నిరసన

మంచిర్యాల, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): నాలుగు వరుసల రహదారి నిర్మాణంలో నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఏఐ) అధికారులు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తొలుత రూపొందించిన రూట్ మ్యాప్‌ను పక్కనబెట్టి కొత్తది తయారు చేయడంతో తమకు నష్టం వాటిల్లుతుందని ప్రజలు వాపోతున్నారు. నెలలపాటు సర్వే జరిపి రూపొందించిన ప్లాన్‌ను కాదని మరోచోట నిర్మించతలపెట్టడం వివాదానికి దారి తీస్తోంది. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గిన అధికారులు రూట్ మ్యాప్‌ను మార్చినట్లు ఆరోపణలున్నాయి. జాతీయ రహదారుల విస్తరణకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో సంబంధిత శాఖల అధికారులు చేపట్టిన సర్వే పట్ల ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు.

ఆర్మూర్ టు మంచిర్యాల...

కేంద్ర ప్రభుత్వం నిర్ణయం మేరకు ఎన్‌హెచ్-63ను నాలుగు వరుసల రహదారిగా విస్తరించనున్నారు. గ్రీన్ హైవే పేరుతో నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ నుంచి మోర్తాడ్, కుమ్మరిపల్లి, జగిత్యాల, ధర్మపురి, రాయపట్నం, లక్షెట్టిపేట మీదుగా మంచిర్యాల జిల్లా కేంద్రం వరకు నాలుగు వరుసల రహదారిగా విస్తరించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ మేరకు కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వశాఖ భూ సేకరణకు గతేడాది మార్చి 14న నోటిఫికేషన్ జారీ చేసింది. ఇందులో భాగంగా దాదాపు 160 కిలోమీటర్ల దూరం రోడ్డు నిర్మాణ పనులు చేపట్టనుండగా జిల్లాలో 36.25 కిలోమీటర్ల మేర విస్తరణ పనులు జరుగనున్నాయి. రోడ్డు విస్తరణలో భూములు, ఇళ్లు కోల్పోయేవారికి 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లిస్తామని ప్రభుత్వం చెబుతుండగా, అరకొర చెల్లింపుల పట్ల ప్రజలు ఆందోళనలకు పూనుకుంటున్నారు.

రూట్‌మ్యాప్‌లో మార్పులెక్కడ...?

ఎన్‌హెచ్-63 కోసం మొదట రూపొందించిన అలైన్‌మెంట్ ప్రకారం ముల్కల్ల సమీపంలోని వాగుకు సమాంతరంగా రహదారి వెళ్లాల్సి ఉంది. అందుకు భిన్నంగా రెండో రూట్ మ్యాప్‌లో వాగుకు దూరంగా ఖరీదైన ఇళ్ల స్థలాల మధ్య నుంచి రహదారి నిర్మాణానికి అధికారులు మార్కింగ్ చేశారు. ఎనిమిది నెలల క్రితం హైవే అథారిటీ పనులను అడ్డుకున్న బాధితులు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. బాధితులు ఢిల్లీకి వెళ్లి కేంద్ర మంత్రులను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. దీంతో ఇంతకాలం పనులు నిలిచిపోగా, కేంద్రం సూచన మేరకు మూడో రూట్ మ్యాప్‌ను అధికారులు రూపొందించారు.

ఈ ప్లాన్ ప్రకారం గోదావరికి సమాంతరంగా రహదారి నిర్మాణం జరిగి, ముల్కల్ల వద్ద వాగుకు సమాంతరంగా వెళ్లాల్సి ఉంది. అయితే ముల్కల్ల వద్దకు వచ్చే సరికి అధికారులు మళ్లీ రెండో రూట్ మ్యాప్‌నే ఫైనల్ చేయడంతో పరిస్థితి మొదటికి వచ్చింది. రూట్ మ్యాప్ మార్చినా వాగుకు సమాంతరంగా కాకుండా ఇళ్ల స్థలాల నుంచి రహదారి నిర్మాణానికి అధికారులు పూనుకున్నారు. దీంతో అత్యంత విలువైన భూములు కోల్పోవలసిన పరిస్థితులు నెలకొన్నాయి. ప్రస్తుతం రహదారి నిర్మాణంలో రూ.20 కోట్లు విలు వ చేసే ఆరెకరాల భూములను ప్రజలు కోల్పోతున్నారు. అక్కడి భూముల విలువ ప్రస్తుతం చదరపు గజం ఒక్కంటికి రూ.8 వేలు పలుకుతుం డగా, ప్రభుత్వ పరంగా బాధితులకు రూ.700 చెల్లిం చేందుకు రంగం సిద్ధమైంది. దీంతో బాధితులంతా రెండు రోజుల క్రితం జిల్లా కేంద్రంలోని నేషనల్ హైవే అథారిటీస్ ఆఫ్ ఇండియా కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ముల్కల్ల వద్ద విలువైన భూముల నుంచి కాకుండా వాగుకు సమాంతరంగా రహదారి నిర్మాణం చేపట్టాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి.

కొత్త రూట్ మ్యాప్‌తో ఆందోళన

మొదటి రూట్ మ్యాప్ ప్రకారం జిల్లాలోని గూడెం నుంచి లక్షెట్టిపేట మీదుగా గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం జరగాల్సి ఉంది. ఇందులో భాగంగా రహదారి హాజీపూర్ మండలంలోని ముల్కల్ల వద్ద వాగు ఒడ్డు నుంచి నేరుగా మందమర్రి మండలం క్యాతనపల్లి వద్ద కాగజ్ నగర్- మంచిర్యాల నేషనల్ హైవే 363కి అనుసంధానం చేయా లి. అయితే రాజకీయ ఒత్తిళ్ల కారణంగా కొత్త రూట్ మ్యాప్ తెరపైకి వచ్చింది. కొత్త రూట్ మ్యాప్ ముల్కల్లలోని క్రైస్తవ ఆసుపత్రి, నర్సింగ్ కళాశాల మధ్య నుంచి రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు అధికారులు సన్న ద్ధమవుతున్నారు. దీంతో కోట్లాది రూపాయల విలువ చేసే భూములను ప్రజలు కోల్పోవలసి వస్తుంది.

గోదావరి తీరం వెంట రహదారి నిర్మాణం

రహదారి నిర్మాణం కోసం లక్షెట్టిపేట, హాజీపూర్, మందమర్రి మండలాలతోపాటు జిల్లా కేంద్రంలో మొత్తం 17 రెవెన్యూ గ్రామాల నుంచి 574.31 హెక్టార్ల భూమిని సేకరించాలని నిర్ణయించారు. లక్షెట్టిపేట మండలంలోని మోదెల నుంచి హాజీపూర్ మండలంలోని ముల్కల్ల వరకు కొత్త అలైన్‌మెంట్ ప్రకారం ప్రస్తుతం జనావాసాలకు దూరంగా గోదావరి నదికి సమాంతరంగా నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందించారు. గోదావరి తీరం నుంచి కనీసం 500 మీటర్ల దూరంలో మెట్ట భూముల నుంచి గ్రీన్‌ఫీల్డ్ హైవే వెళ్లే విధంగా సర్వే చేశారు. ఇంత వరకు బాగానే ఉన్నా ముల్కల్ల వద్ద ఉన్న ప్రస్తుత హైవేను దాటే క్రమంలో అధికారులు మళ్లీ పాత రూట్ మ్యాప్ అమలు చేస్తుండటంతో ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.



హైవే కోసం రూపొందించిన పాత అలైన్‌మెంట్



స్వల్ప మార్పులు చేసి తయారు చేసిన కొత్త అలైన్‌మెంట్

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



రిషాంక్

హాజీపూర్, జనవరి 7: మండలంలోని గుడిపేటలోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాల విద్యార్థి రిషాంక్ కబడ్డీలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ షేరు శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలి పారు. నిర్మల్ జిల్లాలోని లక్ష్మణచాందాలో జరిగిన ఎస్‌జీ ఎఫ్ జోనల్ స్థాయి అండర్ 14 పోటీల్లో ప్రతిభ కనబ రిచారు. ఈ నెల 16 నుంచి 18 వరకు జనగామలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటాడని తెలిపారు. విద్యార్థిని ప్రిన్సిపాల్ శ్రీధర్, పీఈటీ దేవేందర్, ఉపాధ్యాయులు అభినందించారు.

మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్

హాజీపూర్, జనవరి 7: నంనూర్ గ్రామానికి చెందిన యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అశోక్‌గౌడ్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా ఆయన స్మారకార్థం మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు డీజే శేఖర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10 నుంచి గుడిపేట శివారులో టోర్నమెంట్ ప్రారంభమవుతుందన్నారు. ఎంట్రీ ఫీజు వెయ్యి రూపాయలు ఉంటుందని, టోర్నీలో పాల్గొనే వారు 9392894024 నంబరులో సంప్రదించాలని సూచించారు.

12 నుంచి జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్

ఏసీసీ, జనవరి 7: తూముల భీమయ్య చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఈ నెల 12 నుంచి జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు ఓల్డ్ మంచిర్యాల స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బొలిశెట్టి కిషన్, ప్రభాకర్‌లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విన్నర్ జట్టుకు రూ.50 వేలు, రన్నర్ జట్టుకు రూ.25 వేలు పారితోషికంతోపాటు ట్రోఫీ అందిస్తామన్నారు. పాల్గొనే జట్లు ఈ నెల 10లోగా వివరాలను 9963607637, 9959128493లలో నమోదు చేసుకోవాలన్నారు. ఈ నెల 10న డ్రా తీస్తామన్నారు.

అలరించిన ముగ్గుల పోటీలు

ఏసీసీ, జనవరి 7: మంచిర్యాల పట్టణంలోని ఇందిరా నగర్ కాలనీలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఆదివారం నిర్వహించిన ముగ్గుల పోటీలు అలరించాయి. కాలనీకి చెందిన మహిళలు, యువతులు ఉత్సాహంగా ముగ్గుల పోటీల్లో పాల్గొన్నారు. అనంతరం భోగి మంటలు, గాలిపటాలు ఎగురవేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ ముకేష్‌గౌడ్ మాట్లాడుతూ హిందు సంప్రదాయాలకు చిహ్నంగా యేటా సంక్రాంతి పండగను ఘనంగా జరుపుకుంటున్నామన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు.

మహేంద్ర యూత్ కమిటీ ఎన్నిక

జన్నారం, జనవరి 7: మండలంలోని కామన్‌పల్లి, దేవునిగూడెం, కిష్టాపూర్ గ్రామాల మహేంద్ర యూత్ కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. కిష్టాపూర్ అధ్యక్షుడిగా ఓడిపెల్లి స్వామి, సలహాదారులుగా కోడిజుట్టు మల్లేష్, ప్రవీణ్, దేవునిగూడెం గౌరవాధ్యక్షుడిగా ఓడిపెల్లి వెంకటేష్, క్యాషియర్‌గా రాజన్న, కామన్‌పల్లి ఉపాధ్యక్షుడిగా ఒడిపెల్లి ప్రభాకర్, సలహాదారుగా కోరుట్ల లక్ష్మణ్, సంద సతీష్, ప్రధాన కార్యదర్శిగా ఒడిపెల్లి సురేష్, ప్రచార కార్యదర్శిగా నవీన్‌లను ఎన్నుకున్నారు.

వివాదంతో ముగిసిన క్రికెట్ టోర్నీ

కాసిపేట, జనవరి 7: మండల కేంద్రంలో 15 రోజులుగా నిర్వహిస్తున్న కాకా వెంకటస్వామి స్మారక క్రికెట్ టోర్నీ ఆదివారం వివాదంతో ముగిసింది. ఈ టోర్నీలో 16 జట్లు పాల్గొన్నాయి. ఆదివారం కాసిపేట, దేవాపూర్ జట్లు ఫైనల్‌కు చేరుకున్నాయి. ఆట ఆడుతుండగా బౌలింగ్‌లో వివాదం చోటు చేసుకుంది. కాసిపేట జట్టు బౌలర్లు త్రోబాల్స్ వేస్తున్నారని దేవాపూర్ టీం సభ్యులు పేర్కొంటూ వాగ్వాదానికి దిగారు. ఇది వివాదంగా మారడంతో కాసిపేట పోలీసులు చేరుకుని జట్ల సభ్యులను సముదాయించారు. అనంతరం నిర్వాహకులు మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకన్న

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 7: ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా ఉద్యమించాలని సీపీఐ అనుబంధ ఆర్టీసీ కార్మిక సంఘం ఎంప్లాయిస్ యూనియన్ (ఈయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇ.వెంకన్న పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో రీజనల్ ఉమ్మడి ఆదిలాబాద్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం 9 ఏండ్లలో ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా తీవ్ర ఇబ్బందుల పాలు చేసిందని, కండక్టర్లు, డ్రైవర్లపై అధిక పని భారం మోపుతూ అధిక పని వేళలు పెంచడం, ఏరియర్స్, డీఏలు చెల్లించకపోవడంతో ఇబ్బందులు పడ్డారన్నారు. పీఆర్సీ, పెండింగ్ బకాయిలు చెల్లించాలన్నారు. ఆర్టీసీ పరిరక్షణకు ప్రత్యేకంగా ఉద్యమించాలని దిశా నిర్దేశం చేశారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరిస్తూ ఆర్టీసీలో యూనియన్‌లను పునరుద్ధరించాలని, హక్కుల కోసం ఉద్యమిస్తున్న యూనియన్ నాయకులపై ఉక్కుపాదం మోపడం గత ప్రభుత్వంలో జరిగిందన్నారు. ఇప్పటి కైనా హక్కుల సాధనకు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. రానున్న రోజుల్లో ఆర్టీసీలో యూనియన్ ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి రావు, సీపీఐ నాయకులు రామడుగు లక్ష్మణ్, ఏఐటీయూసీ జిల్లాప్రధాన కార్యదర్శి మేకల దాసు, ఉపేందర్, నాయకులు లక్ష్మణ్, మామిడిపల్లి శ్రీనివాస్, రాజేశం, శంకర్, అశోక్, శంకర్, రాజు, శ్రీధర్, వెంకటేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ రాష్ట్ర ఎన్నికల కమిటీ సభ్యుడిగా ప్రేంసాగర్‌రావు

ఏసీసీ, జనవరి 7: కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిటీ సభ్యుడిగా మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు నియమితులయ్యారు. లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్‌ఖర్గే రాష్ట్రాల వారీగా ఎన్నికల కమిటీలను నియమించారు. తెలంగాణకు పీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డి చైర్మన్‌గా, భట్టి విక్రమార్క, జీవన్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామోదర రాజనర్సింహాలతో కలిపి 25 మంది సభ్యులు గల కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీలో ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావుకు స్థానం కల్పించారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఆలయ కమిటీ ఎన్నిక

మందమర్రిటౌన్, జనవరి 7: పట్టణంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆకునూరి లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శిగా రేవెల్లి రాజయ్య, కోశాధికారిగా పూసాల శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా రాజు, శ్రీనివాస్, రాజకిశోర్, కార్యదర్శిగా రాజు, నర్సింహాచారి, చంద్రమౌళిలను ఎన్నుకున్నారు. సత్యనారాయణ, వేణు,నర్సింహాచారిలు పాల్గొన్నారు.

క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలి



మాట్లాడుతున్న ఏసీపీ సదయ్య

బెల్లంపల్లి, జనవరి 7: క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని బెల్లంపల్లి ఏసీపీ సదయ్య అన్నారు. ఆదివారం ఎఎంసీ మైదానంలో టీపీసీసీ రాష్ట్ర ప్రచార కమిటీ జాయింట్ కన్వీనర్ నాతరి స్వామి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ఏసీపీ ప్రారంభించి మాట్లాడారు. క్రీడాకారులను ప్రోత్సహించడానికి ఇలాంటి టోర్నమెంట్‌లు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. క్రీడలతో స్నేహ సంబంధాలు పెరుగుతాయన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. టోర్నీలో బెల్లంపల్లి బార్ అసోసియేషన్ టీం, మున్సిపల్ ఆఫీస్ టీంలు తలపడ్డాయి. రిటైర్డు డీఎస్పీ రవికుమార్, ఎస్‌హెచ్‌వోలు రమేష్, బన్సీలాల్, ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు చెన్నూరి సమ్మయ్య, కాంగ్రెస్ నాయకులు చిన్నరాజం, ఈసా, ఆదర్శవర్ధన్‌రాజు, సిరంగి శంకర్, కొమ్ము రాజన్న, బండి లక్ష్మణ్, మహేష్, రాజేష్, గోపాల్, తారాచంద్, నర్సయ్య, స్వామి, బాలుయాదవ్,మూర్తి,నవీన్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వాజ్‌పేయి మెమోరియల్ క్రికెట్ పోటీలు



విజేత జట్టుకు బహుమతి ప్రదానం చేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్

ఏసీసీ, జనవరి 7: రఘునాథ్ వెరబెల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో దివంగత ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతిని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలో డిసెంబరు 25 నుంచి నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. ఈ టోర్నమెంట్‌లో మొత్తం 44 జట్లు పాల్గొనగా మంచిర్యాలకు చెందిన ఆర్‌సీసీ-బి 11, శ్రీరాంపూర్ చెందిన ప్రగతి స్టేడియం 11 జట్లు ఫైనల్‌కు చేరుకున్నాయి. ఫైనల్ మ్యాచ్‌లో ప్రగతి స్టేడియం 11 జట్టు విజేతగా నిలిచింది. విన్నర్ జట్టుకు రూ. 10 వేలు, రన్నర్ జట్టుకు రూ. 5 వేల నగదుతో పాటు ట్రోఫీలను బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ అందజేశారు. రఘునాథ్ మాట్లాడుతూ యువత క్రీడల్లో రాణించాలనే ఉద్దేశ్యంతో యేటా క్రికెట్, కబడ్డీ టోర్నమెంట్‌లను నిర్వహిస్తున్నామన్నారు. యువత చదువుతో పాటు క్రీడలపై శ్రద్ధ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు హరికృష్ణ, రేన్వా తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

భీమారం, జనవరి 7 : భీమారం సబ్‌స్టేషన్‌లో మరమ్మతు వల్ల సోమవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ కుమారస్వామి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భీమారం సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని కోరారు.

కవి సమ్మేళనం

ఏసీసీ, జనవరి 7: సంగీత సాహిత్య సుధావాహిని ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కవి సమ్మేళనాన్ని ఆదివారం జిల్లా కేంద్రంలోని సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో నిర్వహించారు. డాక్టర్ దాసరి శ్రీనాథ్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి అతిథిగా వాల్మీకి బోయ రాష్ట్ర జేఏసీ స్టీరింగ్ కమిటీ సభ్యుడు వెంకటరమణ హాజరయ్యారు. కవుల ఆధ్యాత్మిక కవితలను గానం చేశారు. ఈ సందర్భంగా 48 మంది కవులను సత్కరించి భగవద్గీత గ్రంథాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కవులు బ్రహ్మయాచార్య, స్వరూపపట్వర్ధన్, హైమావతి, రత్న జానకి, సృజన, దాసరి సుశీల, పద్మ, దుర్గం రాజేశం, కొమ్మెర రాజేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌టీయూ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్లను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 7: జిల్లా కేంద్రంలో రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్‌టీయూ) 2024 సంవత్సరం డైరీ, క్యాలెండర్‌లను ఆదివారం మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు విడుదల చేశారు. ఎస్టీయూ విద్యారంగానికి అందిస్తున్న సేవలను ఎమ్మెల్యే కొనియాడారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటేశ్వర్లు, శంకర్‌గౌడ్, నాయకులు కృష్ణ, సత్తయ్య, సుమన్, కోటేశ్వర్‌రెడ్డి, బాపు, సురేందర్, మన్మోహన్, నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్



ఆన్‌లైన్ ప్రక్రియ పరిశీలిస్తున్న కమిషనర్ రమేష్

నస్పూర్, జనవరి 7 : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే ఆరు గ్యారంటీల పథకాలకు డిసెంబర్ 28 నుంచి ఈ నెల 6వ తేదీ వరకు నిర్వహించిన గ్రామసభల్లో ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులను ఆన్‌లైన్ చేసే ప్రక్రియ మొదలైంది. నస్పూర్ మున్సిపాలిటీలో కొనసాగుతున్న ఆన్‌లైన్ ప్రక్రియను ఆదివారం కమిషనర్ రమేష్ పరిశీలించారు. 25 వార్డుల్లో నుంచి ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, మహాలక్ష్మి, గృహజ్యోతి, చేయూత పథకాలకు లబ్ధిదారులు 16,792 దరఖాస్తులు, తెల్ల రేషన్ కార్డుకు మూడు వేల దరఖాస్తులు వచ్చాయని కమిషనర్ తెలిపారు. ఆన్‌లైన్ ప్రక్రియను మరింత వేగవంతం చేసినట్లు తెలిపారు. వచ్చిన ప్రతీ దరఖాస్తును ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామన్నారు. దరఖాస్తులన్నింటిని ఈ నెల 17లోగా ఆన్‌లైన్ చేయాల్సి ఉంటుందని కమిషనర్ తెలిపారు.

మా ఊరు సేవా సంస్థ సేవలు ఆదర్శం



దుప్పట్లు, సరుకులు పంపిణీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్ రాజు

మందమర్రిటౌన్, జనవరి 7: మందమర్రి మా ఊరు స్వచ్ఛంద సేవా సంస్థ ప్రజల కోసం చేస్తున్న సేవలు అందరికి ఆదర్శంగా నిలుస్తున్నాయని మున్సిపల్ కమిషనర్ రాజు తెలిపారు. ఆదివారం పట్టణంలోని నార్లాపూర్‌లో మా ఊరు స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పేదలకు నిత్యావసర సరుకులు, దుప్పట్లు పంపిణీకి ఆయన హాజరై మాట్లాడారు. రిటైర్డ్ అనంతరం ప్రజలకు సేవలందిస్తున్న ఎండీ ఇబ్రహీంను ప్రతీ ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అనంతరం 30 మందికి దుప్పట్లు, సరుకులు అందించారు. సభ్యులు పెద్ది రాజన్న పాల్గొన్నారు.

యాదవ హక్కులే లక్ష్యంగా ముందుకు సాగుతాం



సమావేశంలో మాట్లాడుతున్న బండి సదానందం యాదవ్

మందమర్రిటౌన్, జనవరి 7: సంచార జీవనం సాగిస్తూ అభివృద్ధికి దూరంగా ఉంటున్న యాదవుల హక్కులే లక్ష్యంగా ముందుకు సాగాలని యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు బండి సదానందం యాదవ్ తెలిపారు. ఆదివారం హైద్రాబాద్‌లో జరిగిన యాదవ సంఘం రాష్ట్ర సమావేశంలో ఆయన మాట్లాడారు. జనాభా నిష్పత్తి ప్రకారం యాదవులకు రాజకీయాల్లో గుర్తింపు దొరకడం లేదన్నారు. కొత్త ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం యాదవుల సమస్యలను పరిష్కరించాలన్నారు. యాదవ సంఘం నూతన సంవత్సరం క్యాలెండర్లను విడుదల చేశారు.

మాలమహానాడు ఆఫ్ ఇండియా కార్యవర్గం



నియామక పత్రం అందుకుంటున్న సుధీర్

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 7: మాలమహానాడు ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడిగా మంచిర్యాలకు చెందిన జూపాక సుధీర్ నియమితులయ్యారు. ఆదివారం హైద్రాబాద్‌లోని నేరేడ్‌మెట్‌లోని బీఆర్ అంబేద్కర్ భవన్‌లో నిర్వహించిన జాతీయ సమావేశంలో జాతీయ అధ్యక్షుడు పసుల రామ్మూర్తి సుధీర్‌కు నియామక పత్రం అందించారు. సుధీర్ మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాల సాధనకు నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.

మాల మహానాడు జాతీయ కార్యదర్శిగా యాదగిరి

బెల్లంపల్లి: మాలమహానాడు జాతీయ కార్యదర్శిగా బెల్లంపల్లికి చెందిన కాసర్ల యాదగిరి నియమితులయ్యారు. ఆదివారం హైద్రాబాద్‌లోని మల్కాజిగిరి నేరేడ్‌మెట్‌లోని అంబేద్కర్ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో జాతీయ అధ్యక్షుడు పసుల రామ్మూర్తి యాదగిరికి నియామక పత్రం అందించారు. పుల్లయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ లెక్చరర్ల జిల్లా కార్యవర్గం



పాల్గొన్న జూనియర్ లెక్చరర్లు

ఏసీసీ, జనవరి 7: మంచిర్యాల జిల్లా గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గాన్ని ఆదివారం జిల్లా కేంద్రంలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా బండి ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా దండనాయకుల సందీప్‌కుమార్, కోశాధికారిగా సోమయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా షఫీయొద్దీన్, మహిళ కార్యదర్శిగా సత్తమ్మ, కార్యవర్గసభ్యులుగా రామయ్య, శ్రీకాంత్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికను అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్, ఉపాధ్యక్షుడు దేవేందర్‌ల పర్యవేక్షణలో నిర్వహించారు. రాష్ట్ర కోశాధికారి నాయిని శ్రీనివాస్ పాల్గొన్నారు.

రెండు పులుల మధ్య ఘర్షణ

- ఒక పులి మృతి
- ఆవాసమే అసలు సమస్య
- ధ్రువీకరించిన అటవీశాఖ అధికారులు



పులి కళేబరాన్ని పరిశీలిస్తున్న సీసీఎఫ్ శాంతారామ్, జిల్లా అటవీఅధికారి నీరజ్‌కుమార్ టిబ్రీవాల్

కాగజ్‌నగర్, జనవరి 7: కాగజ్‌నగర్ మండలం దరిగాం అటవీ ప్రాంతంలో రెండు పెద్ద పులుల మధ్య అధిపత్యం కోసం జరిగిన ఘర్షణలో ఒకపులి మరణించినట్లు అటవీ అధికారులు ప్రకటించారు. పెద్దపులి మృత కళేబరాన్ని శనివారం రాత్రి అటవీ అధికారులు కనుగొన్నారు. దీనికి సంబంధించి అటవీశాఖ అధికారులు ఆదివారం పూర్తిస్థాయిలో విచారణ నిర్వహించారు. కొద్దికాలంగా మహారాష్ట్రలోని తడోబా-అంధారి అటవీప్రాంతం నుంచి పులుల రాకపోకలు పెరిగాయి. ఇందులో ప్రధానంగా ఆడ పులులు ఆసిఫాబాద్‌జిల్లా కాగజ్‌నగర్ డివిజన్‌లోని కడంబా రిజర్వును పులుల సంతాన కేంద్రంగా మలుచుకున్నాయని అధికారులు చెబుతున్నారు. ఈ క్రమంలో రెండు ఆడ పులుల మధ్య ప్రాదేశిక ఆధిపత్య కోసం జరిగిన పోరాటంలో భాగంగానే దరిగాంలో పెద్దపులుల ఘర్షణ జరిగి ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇందుకు సంబంధిత రాష్ట్ర సీసీఎఫ్ శాంతారాం, ఆసిఫాబాద్ జిల్లా అటవీఅధికారి నీరజ్‌కుమార్ గుప్తా ఘటన స్థలాన్ని సందర్శించారు. పరిస్థితిని సమీక్షించారు. అనంతరం విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి పెద్దపులి మృతికి గల కారణాలను వెల్లడించారు. పులుల మధ్య ఆధిపత్య పోరు కొనసాగటం సహజమేనన్నారు. ఇందులో భాగంగానే దరిగాంలో మృతి చెందిన పెద్దపులి కూడా రెండు పులుల మధ్య జరిగిన పోరాటంలో తీవ్రంగా గాయపడి మృతిచెందినట్టు నిర్ధారించారు. ఈ పోరాటంలో మృతిచెందిన ఆడపులికి సంబంధించి ముందు కాళ్లు విరిగిపోయి ఉండటాన్ని బట్టి తీవ్రంగా పోరాడి ఉంటాయని అభిప్రాయపడ్డారు. అంతేకాకుండా పులినోట్లో ఇతర పులికి సంబంధించిన వెంట్రుకలు లభ్యం కావడం అనుమానాలకు మరింత బలాన్ని చేకూరుస్తోందని వెల్లడించారు. ఈ ఘటనలో వేటగాళ్ల ప్రమేయం గాని, ఉచ్చులు పెట్టినట్టు గాని విద్యుత్ షాక్‌తో చంపిన ఆనవాళ్లు గాని లభ్యం కాలేదని వెల్లడించారు.

రోడ్డును తవ్వారు.. వదిలేశారు

- మరమ్మతుల పేరిట పనులు
- పూర్తి చేయించని అధికారులు
- దుమ్ముతో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



తవ్వి వదిలి వేసిన రోడ్డు

సిర్పూర్(టి), జనవరి 7: మండలకేంద్రంలోని బస్టాండు ఏరియాలోని ప్రధానరోడ్డును గుత్తేదారు మరమ్మతులపేరిట పదిహేను రోజుల క్రితం తవ్వాడు. పనులు పూర్తి చేయకుండానే వదిలేశాడు. దీంతో నిత్యం రద్దీఉండే ఈరోడ్డంతా దుమ్ముతో నిండిపోతుండ డంతో చుట్టుపక్కల నివాసాలవారు ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్యేకంగా ఈ రోడ్డు గుండా రైల్వే ప్రయాణికులు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు నిత్యంరాకపోకలు సాగిస్తుంటారు.వారంతా ఈప్రాంతంలో వాహనాలు వెళుతున్నప్పుడు చెలరేగుతున్న దుమ్ముతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సిర్పూర్(టి) రైల్వేస్టేషన్ రోడ్డు, బస్టాండు నుంచి కిలోమీటరు ఉండగా ఇందులో సగం సీసీరోడ్డు, సగం బీటీ రోడ్డు ఉంది. దీంతో తరుచూ రోడ్డు మరమ్మతులు చేస్తు న్నారు. ఈ రోడ్డుకు సగం దూరంలో కల్వర్టు లేక పోవడం రెండో కారణమని వాహనదారులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుమధ్యలో కల్వర్టు మంజూరుచేసి నిలిచిన రోడ్డు పనులు ప్రారంభమయ్యేలా చూడాలని వాహనదారులు కోరుతున్నారు.

పిచ్చి మొక్కలను తొలగించాలి



మూలమలుపు వద్ద పెరిగిన పిచ్చి మొక్కలు

మందమర్రిరూరల్, జనవరి 7: సారంగపల్లి గ్రామంలోని కల్వర్టు సమీ పంలోని తుర్కపల్లికి వెళ్లే దారిలోని మూల మలుపు వద్ద పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి ప్రమాదకరంగా మారాయి. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ దారిగుండా మామిడిగట్టు, వెంకటాపూర్, ఆదిల్‌పేట, పొన్నారం, చిర్రకుంట గ్రామాల నుంచి మందమర్రికి ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు రాకపోకలు సాగిస్తుంటారు. పిచ్చిమొక్కలు ఉండడంతో ప్రమాదాలు జరుగుతాయని ఆందోళన చెందుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి మూల మలుపు వద్ద పిచ్చి మొక్కలను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

అయోధ్య రాములోరి అక్షింతలు పంపిణీ



అక్షింతలు పంపిణీ చేస్తున్న రఘునాథ్

లక్సెట్టిపేటరూరల్, జనవరి 7: మండంలోని తిమ్మాపూర్ గ్రామంలో ఆది వారం అయోధ్య రామ మందిర తీర్థ క్షేత్ర ట్రస్టు ఆధ్వర్యంలో అయోధ్య పూజిత అక్షింతలను బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ ఇంటింటికి పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 22న అయోధ్య రామమందిరం ప్రారంభమవుతుందన్నారు. ఈ సంద ర్భంగా ప్రతీఇంటికి అక్షింతలు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కిషన్, ప్రభాకర్, చిన్నయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌కె 5 గనిలో దొంగతనం

- సెల్‌ఫోన్లు, నగదు చోరీ

శ్రీరాంపూర్, జనవరి 7: శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్‌కె 5 గనిలో శనివారం అర్థరాత్రి కార్మికులు తమ వస్తువులు దాచుకునే చెక్క పెట్టెలను పగులగొట్టి గుర్తు తెలియని దుండగులు సెల్‌ఫోన్లు, నగదు దొంగిలించారు.రోజు మాదిరిగానే కార్మికులు చెక్క పెట్టెల్లో తమ వస్తువులు పెట్టుకొని నైట్ డ్యూటీకి వెళ్లారు. డ్యూటీ ముగిసిన అనంతరం వచ్చి చూసేసరికి 40 పెట్టెల తాళాలు పగులగొట్టి ఉన్నాయి. దీంతో ఆందోళన చెందిన కార్మికులు తమ వస్తువులు చూసుకోగా భారీగా సెల్‌ఫోన్లు, నగదు పోయినట్లు గుర్తించారు. గతంలో కూడా దొంగతనం జరిగి సెల్‌ఫోన్లు, నగదు పోయినట్లు వారు పేర్కొన్నారు. అయితే కార్మికులకు చెందిన ఐదు సెల్‌ఫోన్లు, కొంత నగదు పోయినట్లు ఎస్అండ్ పీసీ సిబ్బంది తమకు ఫిర్యాదు ఇచ్చినట్లు శ్రీరాంపూర్ ఎస్ఐ కె. రాజేశ్ తెలిపారు.

ఘటనా స్థలాన్ని పరిశీలించిన నాయకులు

దొంగతనం జరిగిన విషయాన్ని తెలుసుకున్న ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కె బాజీసైదా గనిలోకి వెళ్లి పెట్టెలను పరిశీలించారు. ఏరియా కార్యదర్శి ప్రసాద్ రెడ్డి, పిట్ కార్యదర్శి నర్సింగరావు, నాయకులు అఫ్రోజ్‌ఖాన్, మల్లేష్, రాజశ్, నాగరాజు పాల్గొన్నారు. ఐఎన్‌టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్ రావు ఆధ్వర్యంలో గనిపైకి వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. కార్మికులకు న్యాయం చేయాలని ఇన్‌చార్జి మేనేజర్ శివయ్య, ఎస్ఎస్ఓ మురళీమోహన్‌ను డిమాండ్ చేశారు.

ఇక లెక్క పక్కాగా...

● విద్యాశాఖ యుడైస్‌లో వివరాల నమోదు

● 1077 పాఠశాలలు, 1,23,999 మంది విద్యార్థులు

కోటపల్లి, జనవరి 7 : ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఎంత మంది విద్యార్థులు ఉన్నారు అనే లెక్క ఇక పక్కాగా లభించనుంది. దీనికి సంబంధించి యూడైస్ పోర్టల్‌లో లెక్కలు పొందుపర్చే ప్రక్రియకు విద్యాశాఖ గత నెలలోనే శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, అల్పాహారం, ఏకరూప దుస్తులు, పుస్తకాలు, స్కాలర్‌షిప్‌లు, రవాణా భత్యం తదితర పథకాలకు ఈ గణాంకాలే కీలకం కానున్నాయి. యుడైస్‌లోని వివరాల ఆధారంగా ప్రభుత్వం బడ్జెట్‌ను కేటాయించనుంది. గతంలో లెక్కలు సక్రమంగా లేక నిధులు పక్కదారి పట్టాయనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఈ ఏడాది నుంచి యుడైస్ ప్లస్ వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తెచ్చారు.

- మూడంచెల విధానంలో పరిశీలన

యుడైస్ ప్లస్‌లో పొందుపర్చిన వివరాలను మూడంచెల విధానంలో పరిశీలిస్తారు. గత నెల రెండో వారంలోనే పాఠశాలల్లో వివరాల నమోదు ప్రక్రియను వేగవంతం చేశారు అధికారులు, పాఠశాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సమగ్ర వివరాలను పరిశీలించి మండల విద్యాశాఖ అధికారులకు నివేదికలు అందించారు. ఈ సమయంలో మండల స్థాయిలో ఎంఈవోలు, జిల్లా స్థాయిలో డీఈవో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జిల్లాలోని 1077 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 1,23,999 మంది విద్యార్థులు ఉన్నట్లు లెక్క తేలింది. ఇప్పటికే మండల స్థాయిలో యుడైస్ వివరాల నమోదు ప్రక్రియ పూర్తి కాగా ప్రస్తుతం జిల్లా స్థాయిలో వెరిఫికేషన్ కొనసాగుతుంది. ఇది పూర్తయితే ఈ వేదికను రాష్ట్ర విద్యాశాఖకు అందించనున్నారు.

- శాశ్వత క్రమ సంఖ్య కేటాయింపు

ఏక్ భారత్ ఏక్‌శ్రేష్ఠ భారత్ కార్యక్రమంలో భాగంగా ప్రాథమిక స్థాయిలో నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతున్నది. ఇందు కోసమే ప్రతి విద్యార్థికి అపార్ పేరుతో శాశ్వత విద్య క్రమ సంఖ్య కేటాయించనున్నారు. అన్ని రకాల బడుల్లో, కళాశాలల్లో ప్రవేశం పొందిన నాటి నుంచి కళాశాల విద్య పూర్తయ్యే వరకు విద్యార్థికి కేటాయించిన క్రమ సంఖ్య ఆధారంగా వివరాలను నమోదు చేస్తారు. ఇక విద్యాశాఖకు సంబంధించి యుడైస్ పోర్టల్‌లో గత నెల చివరి నాటికి వివరాలు పొందు పర్చారు. విద్యార్థుల సంఖ్య, ఎన్ని బడులు ఉన్నాయి, ఎన్ని తరగతి గదులు అందుబాటులో ఉన్నాయి. ఎంత మంది విద్యార్థులు మధ్యాహ్న భోజనం తింటున్నారు. యూనిఫాంలు, పుస్తకాలు ఎన్ని అవసరం తదితర సమగ్ర వివరాలను పోర్టల్‌లో నిక్షిప్తం చేశారు.

పారదర్శకత కోసం

యాదయ్య, జిల్లా విద్యాశాఖ అధికారి



ప్రభుత్వ బడుల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, మౌలిక వసతులు తదితర వివరాలను పకడ్బందీగా యుడైస్ పోర్టల్‌లో నమోదు చేశాం. నిధులను సక్రమంగా వినియోగించుకోవడానికి, పారదర్శకత పాటించడానికి ఇది ఉపయోగపడనుంది. ప్రతీ సంవత్సరం యుడైస్ ఆధారంగానే విద్యా సంక్షేమ పథకాలు, నిధులు మంజూరు కానున్నాయి.



పాఠశాల విద్యార్థులు

- నిధులు సద్వినియోగమయ్యేలా...

బడుల్లో నిర్వహణ నిధులకు సంబంధించి పారదర్శకత కోసమే యుడైస్ ప్లస్ వెబ్‌సైట్ ఉపయోగపడనుంది. యేటా జరిగే మార్పులు, చేర్పులపై బడుల నిర్వాహకులకు ప్రభుత్వం దీని ద్వారా మార్గనిర్దేశం చేస్తుంది. ఇప్పటికే మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు ఈ ప్రక్రియను పూర్తి చేసి జిల్లా స్థాయికి నివేదిక సమర్పించారు. మన ఊరు మన బడి, పీఎం శ్రీ పథకం కింద ప్రభుత్వ బడులను ఎంపిక చేస్తున్న నేపథ్యంలో యుడైస్ వివరాల నమోదు ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇక జిల్లా స్థాయిలో కొనసాగుతున్న వెరిఫికేషన్ మరో వారం రోజుల్లో పూర్తి కానున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఇది పూర్తయితే దీని ఆధారంగా వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభం నాటికే అన్ని వసతులు సమకూరేలా ప్రతి విద్యార్థికి అందేలా , నిధులు పక్కదారి పట్టకుండా ఉండేలా యుడైస్ పోర్టల్ ఉపయోగపడనుంది.

వేంకటేశ్వర ఆలయంలో వైభవంగా లక్ష పుష్పార్చన

కోరుట్ల, జనవరి 7 : పట్టణంలోని వేంకటేశ్వర ఆలయంలో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం కొరాయి ఉత్సవం(వన మహోత్సవం) వైభవంగా నిర్వహించారు. ఆదివారం రాత్రి సమయంలో స్వామివారికి లక్ష పుష్పార్చన కార్యక్రమాన్ని వేద పండితుడు బీర్నంది నర్సింహామూర్తి మంత్రోచ్చారణల మధ్య జరిపారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించిన వేదపండితులు పుష్పార్చన కార్యక్రమాన్ని జరిపారు. కొరాయి ఉత్సవంలో భాగంగా వేంకటేశ్వర-అలివేలుమంగ-పద్మావతి సహిత ఉత్సవవిగ్రహాలకు ప్రత్యేక పూజలను నిర్వహించి అభిశేకం, అర్చన కార్యక్రమాలను జరిపారు. వేంకటేశ్వర భజన మండలి సభ్యులతో భజన కార్యక్రమాలను జరిపారు. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించంగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్న మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో దేవదాయశాఖ అధికారులు భక్తులు పాల్గొన్నారు.

లారీ డ్రైవర్ల నిరసన



ర్యాలీలో పాల్గొన్న లారీ డ్రైవర్లు

కాసిపేట, జనవరి 7 : లారీ ప్రమాదానికి గురైనప్పుడు లారీ డ్రైవర్లపై తెచ్చిన కఠిన చట్టాన్ని ఎత్తివేయాలని ఆదివారం దేవాపూర్‌లో లారీ డ్రైవర్లు నిరసన చేపట్టారు. లారీ డ్రైవర్ల సంఘం నాయకుడు ఇస్మాయిల్ మాట్లాడుతూ ప్రమాదవశాత్తు లారీ ప్రమాదానికి కారణమైనప్పుడు లారీ డ్రైవర్లపై రూ. 7 లక్షల జరిమానా, 10 ఏండ్ల జైలు శిక్షను విధిస్తూ కేంద్ర ప్రభుత్వం కొత్త చట్టాన్ని తీసుకువచ్చిందని, ఇది అన్యాయమన్నారు. ప్రమాదానికి కారణం కాకపోయినా లారీ డ్రైవర్ల జీవితాలను నాశనమవుతాయన్నారు. వెంటనే ఈ చట్టాన్ని రద్దు చేయాలన్నారు. లారీ డ్రైవర్లు పాల్గొన్నారు.

చిన్నారిని అభినందించిన ఎమ్మెల్యే

మందమర్రిటౌన్, జనవరి 7: హైద్రాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో భారత ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన గిన్నీస్ వరల్డ్ రికార్డు కూచిపూడి కళా వైభవంలో మందమర్రి పట్టణానికి చెందిన చునార్కర్ ఆరాధ్య నృత్య ప్రదర్శన చేసి బహుమతి అందుకుంది. ఆదివారం ఎమ్మెల్యే వివేక్, మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు చిన్నారిని అభినందించారు.

కాంగ్రెస్‌తోనే గ్రామాలు అభివృద్ధి



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

దండేపల్లి, జనవరి 7 : కాంగ్రెస్ ప్రభుత్వంలోనే గ్రామాలు మరింత అభివృద్ధి చెందుతాయని తాళ్లపేట ఎంపీటీసీ కంది హేమలత, మండల ప్రధానకార్యదర్శి కంది సతీష్‌లు అన్నారు. ఆదివారం దండేపల్లి మండలం తాళ్లపేట గ్రామంలో రూ. 3.30 లక్షల మండల పరిషత్ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు కాంతారావు, లింగారావు, మాజీ ఎంపీటీసీ రాజయ్య, నాయకులు రాజన్న, చంద్రయ్య, సాదిక్, సాగర్, మధు తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



గిరిజన గ్రామాల్లో వైద్య శిబిరం

లింగాపూర్, జనవరి 7: మారుమూల గ్రామాల్లో దీపం ఫౌండేషన్ అధ్వర్యంలో నిర్వహిస్తున్న వైద్యశిబిరాన్ని గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని జైనూర్ సీఐ మల్లేశం అన్నారు. మండలంలోని మారుగూడ, నాగుగూడ, సోలగూడ తదితర గ్రామాల్లో ఆదివారం దీపం ఫౌండేషన్ అధ్వర్యంలో పోలీసులు వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 2వందల మంది రోగులకు వైద్యం అందించామని సీఐ మల్లేశం తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ ప్రవీణ్, ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నాగర్‌గోజే అశోక్, హెచ్ఆర్సీ జిల్లా చైర్మన్ డోంగ్రే సమాధాన్, జిల్లా ప్రధానకార్యదర్శి ముండే సతీష్, నాయకులు కేంద్రే పరమేశ్వర్, లటపటే రాహుల్, గ్రామస్థులు పాల్గొన్నారు.

జడ్పీటీసీ కుటుంబాన్ని పరామర్శించిన నాయకులు



జడ్పీటీసీ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బెజ్జూరు, జనవరి 7: మండల జడ్పీటీసీ పుష్పలతకు చెందిన పత్తిని గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించి దగ్ధం చేయగా విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు ఆదివారం ఆమె ఇంటికి వెళ్లి పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు సకారాం, బషరత్‌ఖాన్, వెంకన్న, ఎంపీటీసీ శ్రీను, ఇస్తారి, లక్ష్మీనారాయణ, అమీరుద్దీన్, భిక్షమయ్య, నారాయణ,పెంటన్న తదితరులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలే అవార్డు అందుకున్న ఉపాధ్యాయురాలు



అవార్డును అందుకుంటున్న ఉపాధ్యాయురాలు కడేర్ల వీణ

కెరమెరి, జనవరి 7: మండలంలోని సావర్‌ఖేడ ఉపాధ్యాయురాలు కడేర్ల వీణ సావిత్రి బాయిపూలే అవార్డును అందుకున్నారు. నాగ్‌పూర్‌లోని శ్రీక్షత్రియ్ కోసరేమాలి సమాజ్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి జయంతోత్సవాల్లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆమె అఖిల భారతమాలి సమాజ్ జాతీయనాయకులు అశోక్‌రావు, ఎన్ కోకోడే, రాష్ట్రఅధ్యక్షుడు సుకుమార్ పెట్కులే, ఆర్మీమేజర్ ఉత్తమ్‌రావ్‌చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు.

ప్రాణహితలో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

బెజ్జూరు, జనవరి 7: మండలంలోని సోమిని సమీపంలోని ఎర్రబండ వద్ద ప్రాణహితనదిలో పెంచికలపేట మండలం లోడ్‌పల్లి గ్రామానికి చెందిన ఆత్రం ధర్మయ్య (60)శనివారం గల్లంతు కాగా ఆదివారం అతని మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై విక్రం తెలిపారు. బోనాల సందర్భంగా ప్రాణహితకు స్నానం చేయడానికి వెళ్లి గల్లంతైన విషయం తెలిసిందే. నీటిలో మునిగిన స్థలం నుంచి సుమారు వందమీటర్ల దూరంలో మృతదేహం లభ్యమైంది. చేపల కోసం మత్స్యకారులు వేసిన వలకు ధర్మయ్య మృతదేహం తట్టుకుంది. ఈ విషయాన్ని పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి కుమారుడు లచ్చిరాం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడి కుటుంబాన్ని లోడ్‌పల్లి సర్పంచ్ శ్రీనివాస్ పరామర్శించారు.

ఒర్రెపై కల్వర్టు లేక ఇబ్బందులు

● మురుగు నీరు దాటి బడికి వెళ్తున్న విద్యార్థులు ● ఇబ్బందులు పడుతున్న ప్రజలు ● పట్టించుకోని అధికారులు

వాంకిడి, జనవరి 7: వాంకిడి మండలంలోని ఖిరిడి గ్రామం నుంచి వెళ్తున్న ఒర్రెపై కల్వర్టు లేక ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రభుత్వ ఉన్నతపాఠశాలకు సమీపంలో ఒర్రె ఉండడంతో ప్రతిరోజు విద్యార్థులు ఒర్రె దాటి పాఠశాలకు వెళ్లాల్సి వస్తోంది. ఇదే ఒర్రెలో గ్రామంలోని మురుగు నీరుకూడా కలుస్తుండడంతో ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వర్షాకాలంలో వరదలకు ఒర్రె ఉప్పొంగితే ఆరోజు విద్యార్థులు పాఠశాలకు వెళ్లలేని పరిస్థితి ఉంటుంది. దీంతో పాటు కుమరంభీం ప్రాజెక్టు కాలువకు రైతులు ఆయిల్ ఇంజన్‌లు వేసి పొలాలకు నీరు సరఫరా చేసినపుడు ఈ కాలువ గుండా నీరు ప్రవాహిస్తుంటుంది. ఒర్రెపై కల్వర్టు నిర్మించాలని పలుమార్లు ఉన్నతాధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందించినా ఫలితం లేకుండా పోతోందని గ్రామస్థులు పేర్కొంటున్నారు. ఇప్పటి కైనా ఉన్నతాధికారులు సర్పందించి ఒర్రెపై కల్వర్టు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



మురుగు నీరు దాటి పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులు(ఫైల్)

● కల్వర్టు నిర్మించాలి - డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి, గొడిసెల కార్తీక్



ఖిరిడి గ్రామంలోని ఒర్రెపై కల్వర్టు నిర్మించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి. గ్రామం మధ్యనుంచి వెళ్తున్న ఒర్రె కారణంగా విద్యార్థులు, ప్రజలు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో వరదలకారణంగా వరద నీరు దాటలేని పరిస్థితి ఉంటుంది. ఒర్రెపై కల్వర్టు నిర్మించాలని జిల్లా అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేసి నా ఫలితంలేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కల్వర్టు నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలి.



బోరుకు భూమిపూజ

వాంకిడి, జనవరి 7:మండలంలోని లింబాజిగూడ, లక్ష్మీపూర్, పకిడిగూడ, రింగరిట్‌గ్రామాల్లో చేతిపంపు ఏర్పాటుకు ఆదివారం జడ్పీటీసీ అజయ్‌కుమార్ భూమిపూజ చేశారు. మండలంలోని నీటిఎద్దడి గల గ్రామాల్లో తాగునీటిసదుపాయం కల్పిస్తామని ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఇచ్చిన హామీమేరకు చేతిపంపు ఏర్పాటుకు నిధులు మంజూరుచేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు, జడ్పీటీసీలకు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.


కొబ్బరికాయ కొడుతున్న జడ్పీటీసీ అజయ్‌కుమార్


ముగ్గుల పోటీలో పాల్గొన్న మహిళలు


ప్రథమ బహుమతి పొందిన బి.సరితకు బహుమతిని అందజేస్తున్న రూరల్ సీఐ నాగరాజు, ఎస్సై సోనియ, న్యాయనిర్ణేతలు

అవనిపై హరివిల్లు

- ఉత్సాహంగా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముగ్గుల పోటీలు
- భారీగా తరలివచ్చిన మహిళలు
- పాల్గొన్న ప్రతి ఒక్కరికీ బహుమతి

కాగజ్‌నగర్/కాగజ్‌నగర్‌టౌన్/సిర్పూరు(టి)/పెంచికల్‌పేట, జనవరి 7: జిల్లాలోని కాగజ్‌నగర్ సర్‌సిల్క్ పార్కులైన్ గ్రౌండులో ఆదివారం 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ఆధ్వర్యంలో కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గులపోటీలు.. పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు.. బెంగుళూర్ రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన" స్థానిక పార్టనర్ ఆదిత్యనర్సింగ్ హోం, ఎమర్ కన్‌స్ట్రక్షన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలకు జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన మహిళలు పాల్గొన్నారు.

పోటీలలో మొత్తం 50మంది మహిళలు పాల్గొనగా, ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు పాల్గొన్నవారందరికీ కన్సోలేషన్ బహుమతులు ముఖ్యఅతిథులుగా హాజరైన రూరల్‌సీఐ నాగరాజు, రూరల్ ఎస్సై సోనియా, నిర్వాహకుల చేతుల మీదుగా అందజేశారు. పోటీల్లో ప్రథమ బహుమతిని పట్టణానికి చెందిన బి సరిత, ద్వితీయ పి మాధవి(కాగజ్‌నగర్), తృతీయ బహుమతి ఆసిఫాబాద్‌కు చెందిన ఎం పద్మ విజేతలుగా నిలిచారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా కాగజ్‌నగర్‌కు చెందిన అడ్వకేట్ శశిరేఖ, స్కూల్‌అసిస్టెంట్ కవిత, సామంతుల రాణి వ్యవహరించారు.

బహుమ తుల ప్రదానోత్సవ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రూరల్ సీఐ నాగరాజు మాట్లాడుతూ ముగ్గులు వే యడం నానాటికి కనుమరుగై పోతున్న వేళ సంస్కృతిని కాపాడేందుకు 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ముగ్గులు వేయడంలో సైన్స్ దాగి ఉందన్నారు. ఆవుపేడ చల్లి ముగ్గులు వేస్తే ఎంతో శ్రేష్టమన్నారు. భవిష్యత్తు తరాల వారికి ఆదర్శంగా నిలిచేట్లు చేస్తున్న ఆంధ్రజ్యోతి టీంను అభినందించారు. ఎస్సై సోనియా మాట్లాడుతూ మహిళలు ఉత్సా హంతో ముగ్గుల పోటీకి తరలి రావటం సంతోషకరంగా ఉందన్నారు. భవిష్యత్తులో ముగ్గుల పోటీలు మరెన్నో నిర్వహించి ప్రజల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయాలని ఆకాంక్షించారు. న్యాయనిర్ణేతలు అడ్వకేట్ శశిరేఖ, స్కూల్‌అసిస్టెంట్ కవిత, సామంతుల రాణి మాట్లాడుతూ అన్ని రంగాల్లో రాణిస్తున్న నేటి మహిళలు సంస్కృతిక, సంప్రదాయాలు కాపాడడానికి ముందుకు రావడం గొప్ప విషయమన్నారు. సంక్రాంతి పండుగ పూట మహిళలను ఉత్సాహపరిచేందుకు ముత్యాల ముగ్గుల పోటీలను నిర్వహించిన 'ఆంధ్రజ్యోతి' యాజమాన్యానికి ధన్యవాదాలు తెలియజేశారు. వాకర్స్ అసోసియేషన్ సభ్యులు ఎం సుభాష్, భారత్ మార్కంట్ షాపు యాజమాని రాజేష్, అశోక్‌లోయా మాట్లాడుతూ మహిళ ల కోసం వేదిక ఏర్పాటు చేసి ముగ్గుల రూపంలో వారిలోని ప్రతిభను వెలికితీసే ప్రయత్నం చేస్తున్న 'ఆంధ్రజ్యోతి' కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో 'ఆంధ్రజ్యోతి' జిల్లా స్టాఫ్‌రిపోర్టర్ బెంద్రె సదానందం, రిపోర్టర్లు ఉప్పుల తిరుమలాచారి, గంధం శ్రీనివాస్, నజీర్ అలీ, శ్రీధర్ పాల్గొన్నారు. అలాగే వ్యాఖ్యాతలుగా ఆర్ట్ టీచర్ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు. కాగా ఈ పోటీల్లో మైనార్టీకి చెందిన మహిళ పాల్గొని అందరికీ ఆదర్శప్రాయంగా నిలిచింది.


ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయ నిర్ణేతలు



ప్రథమ బహుమతి పొందిన ముగ్గు, విజేత బి సరిత

ఆనందంగా ఉంది.. : బి సరిత, ప్రథమ బహుమతి విజేత

'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముగ్గులపోటీల్లో పాల్గొనటం సంతోషంగా ఉంది. అంతరించిపోతున్న సంప్రదాయాలను కాపాడే ప్రయత్నం చేస్తున్న 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' సంస్థల సేవలు ప్రశంసనీయం. మహిళల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఇది చక్కటి వేదిక. ఇలాంటి పోటీలు రానున్న తరాల వారికి సోపానాలుగా మారుతాయి. ఆంధ్రజ్యోతి ఏబీఎన్ వారికి చాలా థ్యాంక్స్



ద్వితీయ బహుమతి పొందిన ముగ్గు, విజేత పి మాధవి

పోటీలు ఉత్తేజాన్ని నింపుతున్నాయి : పి మాధవి ద్వితీయ బహుమతి విజేత

'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' నిర్వహిస్తున్న ముగ్గుల పోటీలు మహిళల్లో ఉత్తేజాన్ని నింపుతున్నాయి. నాకు రెండో బహుమతి రావటం ఆనందంగా ఉంది. ప్రతిసారి నిర్వహించే ముగ్గుల పోటీల్లో పాల్గొంటున్నాను. 'ఆంధ్రజ్యోతి'కి ధన్యవా దాలు. ఇలాంటి ముగ్గుల పోటీలు ప్రతి యేటా నిర్వహిస్తు న్నందుకు చాలా సంతోషంగా ఉంది.


తృతీయ బహుమతి పొందిన ముగ్గు, విజేత ఎం పద్మ

ప్రతిభకు చక్కటి వేదిక : ఎం పద్మ, తృతీయ బహుమతి విజేత

'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముగ్గుల పోటీల ద్వారా మహిళల్లో సృజనాత్మకతను వెలికితీయడం సంతోషంగా ఉంది. ముత్యాల ముగ్గుల పోటీలు నిర్వహించిన 'ఆంధ్రజ్యోతి' యాజమాన్యానికి ధన్యవాదాలు. మహిళల ప్రతిభ వెలికి తీసేందుకు ఇది ఒక చక్కటి వేదిక. 'ఆంధ్రజ్యోతి' వారికి ధన్యవాదాలు. ప్రతి సంవత్సరం జరిగే పోటీల్లో పాల్గొంటున్నాను.

అల్లీగూడలో శ్రమదానం


బుగ్గ పేన్‌కు పూజలు చేస్తున్న ఆదివాసులు

సిరప్పూర్(యు) జనవరి 7: మండలంలోని అల్లీగూడలో ఆదివారం రాయి సెంటర్ సార్మేడి ఆత్రం ఆనంద్‌రావ్ పిలుపు మేరకు యువకులు బుగ్గపేన్‌లో శ్రమదానం నిర్వహించారు. ఆలయం చుట్టూ శ్రమదానం నిర్వహించి ఆలయంలో ప్రత్యేకపూజలు చేశారు. ఈసందర్భంగా యూత్‌అధ్యక్షుడు సెడ్మకీ జానేరావ్, గ్రామపటేల్ సెడ్మకీ అర్జు, యూత్‌సభ్యులు కుంర వసంత్‌రావ్, మేస్రాం సుభాష్, తోడ్సం సుంగు, గ్రామస్థులు పాల్గొన్నారు.

అయోధ్య శ్రీరాముడి అక్షింతల పంపిణీ

ఆసిఫాబాద్, జనవరి 7: మండలంలోని మారుమూల గిరిజన గ్రామాలైన మోవాడ, అడదస్నాపూర్ గ్రామాల్లో ఆదివారం అయోధ్య శ్రీరాముడి అక్షింతలను, ఫొటోలను ఆసిఫాబాద్ మండలకమిటీ ఆధ్వర్యంలో పంపిణీచేశారు. కార్యక్రమంలో సంయోజక్ ఆంజనేయులు, సతీష్‌బాబు, వెంకన్న, వేణుగోపాల్, కోటేశ్వరరావు, విశాల్, శ్రీనివాస్, ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

కౌటాల: అయోధ్య శ్రీరామ అక్షింతలను మండలంలోని తలోడి గ్రామంలో ఆదివారం హనుమాన్ మందిర్‌లో పూజలు చేసి శోభాయాత్ర నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి అక్షింతలను పంపిణీ చేశారు. ఈనెల22న ప్రతిఇంటిపై శ్రీరాముడి జెండాను ఎగరేయాలని వారు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు సత్యనారాయణ, వెంకటేష్, రమేష్, బాపు, ప్రదీప్, శంకర్, బాలయ్య, సంతోష్, సాయి, మునేష్, మహిళలు పాల్గొన్నారు.


మోవాడలో ర్యాలీ నిర్వహిస్తున్న నిర్వాహకులు, గ్రామస్థులు

విద్యారంగ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి


ఎమ్మెల్యే కోవ లక్ష్మిని సన్మానిస్తున్న టీయూటీఎఫ్ నాయకులు

ఆసిఫాబాద్, జనవరి 7: విద్యారంగ సమస్యల పరిష్కారంపై ప్రత్యేకదృష్టి సారిస్తామని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే నివాసంలో టీయూటీఎఫ్ క్యాలెండర్, డైరీని ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వపాఠశాలల్లో నెలకొన్న సమస్యలపై ప్రత్యేక దృష్టిసారించి వాటిని పరిష్కరిస్తామన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కూడా తమ వంతు కృషిచేస్తామన్నారు. కార్యక్రమంలో టీయూటీఎఫ్ నాయకులు సదాశివ్, జనార్ధన్, వెంకటేష్‌ప్రకాష్, శ్రీనివాస్, రవి, ధన్‌రాజ్, విద్యాసాగర్, మధు పాల్గొన్నారు.



ఐఎన్‌టీయూసీలో చేరిక

మందమర్రిటౌన్, జనవరి 7: మందమర్రి ఏరియా బీఎంఎస్ సెక్రెటరీ ప్రదీప్ యూనియన్‌కు రాజీనామా చేసి ఐఎన్‌టీయూసీ మందమర్రి ఏరియా ఉపాధ్యక్షుడు దేవిభూమయ్య ఆధ్వర్యంలో ఐఎన్‌టీయూసీలో చేరారు. ప్రదీప్‌కు ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్ కండువా కప్పి యూనియన్‌లోకి ఆహ్వానించారు.

కార్మికుల హక్కుల కోసం పోరాడేది సీఐటీయూ

జైపూర్, జనవరి 7: కార్మికుల హక్కుల కోసం పోరాడేది సీఐటీయూ యూనియన్ అని యూనియన్ రాష్ట్రఅధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఇందారంలో ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సింగరేణి గుర్తింపు ఎన్నికల్లో సహకరించిన ప్రతి కార్మికుడికి ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. సీఐటీయూ కార్మికుల పక్షాన పోరాడే యూనియన్ అని, మిగితాయూనియన్‌లు సంస్థ పక్షాన మాట్లాడుతాయని ఆయన పేర్కొన్నారు. సీఐటీయూలో పనిచేసే కార్యకర్తలు కార్మికుల హక్కులపై ప్రశ్నించేతత్వం కలిగి ఉండాలన్నారు. ఇతర యూనియన్‌ల నుంచి పలువురు కార్మికులు సీఐటీయూలో చేరగా వారికి ఆయన కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు గోపాల్, బాలాజీ, కస్తూరి చంద్రశేఖర్, వెంగళ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

శ్రీరాంపూర్, జనవరి 7: తమ సమస్యలు పరిష్కరించాలని సింగరేణి విశ్రాంత కార్మికుల సంక్షేమ సంఘం నాయకులు ఆదివారం మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు వినతిపత్రం అందించారు. అనంతరం సంఘం అధ్యక్షుడు దండంరాజు రాంచందర్‌రావు, ఉప ప్రధానకార్యదర్శి అళవందార్ వేణుమాధవ్, రిటైర్డ్ డీవైజీఎం(ఆర్‌సివి) రాజు మాట్లాడారు. తమకు అనేక సమస్యలున్నా సింగరేణి అధికారులు పట్టించుకోవడం లేదని వారు పేర్కొన్నారు. వాటిని వెంటనే పరిష్కరించాలని కోరారు. తమ వినతిపత్రానికి మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఆయన పేర్కొన్నారు.

ఉప్మాలో పురుగులున్నాయన్నందుకు చార్జిషీట్


ఉప్మాలో కనిపిస్తున్న పురుగులు

శ్రీరాంపూర్, జనవరి 7: గనిలోని క్యాంటీన్‌లో తయారుచేసిన ఉప్మాలో పురుగులున్నాయన్నందుకు ఓ కార్మికుడు చార్జిషీట్ కమ్ సస్పెన్షన్ ఆర్డర్ అందుకున్నాడు. శ్రీరాంపూర్‌లోని ఎస్‌ఆర్‌పి3,3ఏ గనికి చెందిన క్యాంటీన్‌లో శనివారం ఉదయం ఉప్మా తయారు చేశారు. టిఫిన్ చేస్తుండగా ఆ ఉప్మాలో పురుగులున్నట్లు ఓ కార్మికుడు గమనించి, ఫొటో తీసి అతను తమ గనికి చెందిన కార్మికుల గ్రూపులో పెట్టాడు. అయితే ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న గని యాజమాన్యం సదరు కార్మికుడు ఉప్మాలో కనిపించిన పురుగుల ఫొటోలు సోషల్ మీడియాలో పెట్టాడని, తప్పుడు సమాచారం పోస్టు చేశాడని ఆరోపిస్తూ దీనిని క్రమశిక్షణ రాహిత్యంగా పేర్కొంటూ ఈ నెల 8నుంచి 10రోజుల పాటు సస్పెన్షన్ చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీచేసింది. అంతేకాకుండా చార్జిషీట్ అందిన నాలుగు రోజుల్లోగా దానికి సమాధానం చెప్పాలని అందులో పేర్కొంది. లేనిపక్షంలో క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. అయితే తానుచూసిన విషయాన్ని తమ గ్రూపులో పేర్కొనడం తప్పినట్టవుతుందని గని కార్మికులు పేర్కొంటున్నారు.

పైగా ఇదేమి సంస్థకు, గనికి సంబంధించిన రహస్యాన్ని బహి ర్గతం చేయడం కాదని ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. తమ సహచర కార్మికుడిపై సస్పెన్షన్ కమ్ చార్జిషీట్‌ను ఎత్తివేయాలని కోరుతున్నారు.

తరలిపోయిన కోల్ ఇండియా హాకీ పోటీలు

శ్రీరాంపూర్, జనవరి 7: కోల్‌ఇండియా హాకీ పోటీలు భూపాలపల్లి ఏరియాకు తరలిపోయాయి. గతంలో శ్రీరాంపూర్ ప్రగతిస్టేడియంలో డిసెంబర్14 నుంచి నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయగా, అదేనెల23 నిర్వహించనున్న సింగరేణి డే ఇతరకారణాల వల్ల జనవరికి వాయిదా వేశారు. జనవరి18 నుంచి జరగాల్సి ఉండగా, ఏరియాలో 81శాతం మాత్రమే బొగ్గు ఉత్పత్తి జరగడం, పోటీలకు గ్రౌండ్ అనుకూలంగా లేదని శ్రీరాంపూర్ ఏరియాబాధ్యులు చెప్పడంతో భూపాలపల్లికి చెందిన అధికారులు పోటీలు నిర్వహించేందుకు ముందుకు వచ్చారు. దీంతో ఆయాపోటీలు ఎక్కడ జరుగుతాయనే విషయం చర్చనీయాంశంగా మారింది. ఈ విషయంపై జీఎం బి సంజీవరెడ్డిని వివరణ కోరగా, పోటీల నిర్వహణకు శ్రీరాంపూర్‌ప్రగతిస్టేడియం అప్పుడే సిద్ధంగా లేదని, పైగాఏరియాలో ఇప్పటివరకు కేవలం 81శాతం మాత్రమే బొగ్గుఉత్పత్తి జరిగిందని తెలిపారు. మిగిలిన మూడు నెలల్లో లక్ష్యాన్ని సాధించాల్సి ఉందన్నారు. ఈ విషయం గురించి ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చినట్లు పేర్కొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక


ఒకచోట చేరిన 2011-12బ్యాచ్ విద్యార్థులు

వాంకిడి, జనవరి 7: వాంకిడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2011-12బ్యాచ్ పదవతరగతి విద్యార్థులు పన్నెండుసంవత్సరాల తర్వాత ఆదివారం ఒక్కచోట కలుసుకున్నారు. ఒకరిని ఒకరు ఆప్యాయంగా పలకరించుకుని ఆడిపాడారు. ఆనాటి మధురస్మృతులను జ్ఞాపకం చేసుకున్నారు. తమ కుటుంబసభ్యుల బాగోగులు అడిగితెలుసుకున్నారు. చిరునామాలు సేకరించుకుని వాట్సాప్ గ్రూపుఏర్పాటు చేసుకున్నారు. అందరూకలిసి విందుభోజనాలు చేశారు. అప్పటి హెచ్‌ఎం ఎంఏ జబ్బార్, ఉపాధ్యాయులు వడ్లూరి రాజేష్, సంతోష్, రాజన్న,లక్ష్మయ్య,భూపతి,సంతోష్‌ను కార్యక్రమానికి ఆహ్వానించి సత్కరించారు. విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదిగి మంచిపేరు తెచ్చుకోవాలని ఉపాధ్యాయులు సూచించారు.

ఓవర్‌లోడ్‌తో ముందుకు కదలని లారీ

- గంట పాటు ట్రాఫిక్ జాం


రోడ్డు మధ్యలో నిలిచిపోయిన లారీ

సిర్పూర్(టి), జనవరి 7: చత్తీస్‌గఢ్ నుంచి ఓవర్ లోడ్‌తో వస్తున్న లారీ ఆదివారం మండల కేంద్రంలోని డౌనల్ ఏరియాలో ఒడ్డెక్కక పోవడంతో వాహనాలు నిలిచిపోయాయి. తరుచుగా ఓవర్ లోడ్ లారీలు వెంకట్రావు పేట-మహారాష్ట్ర మధ్యలోని పెన్‌గంగా వంతెన పైనుంచి వెళ్తున్నాయి. దీంతో ఆదివారం రెండువాహనాలు మండల కేంద్రంలోని ఒడ్డు ఎక్కకపోవడంతో సమస్య తలెత్తింది. ఈ రోడ్డు గుండా భారీ వాహనాలు నడవడం వల్ల రోడ్డు పాడవుతున్నాయని మండల వాసులు పేర్కొంటున్నారు.

20మందికి కంటి ఆపరేషన్లు


కంటి ఆపరేషన్ చేయించుకున్న వారితో వైద్యులు

కౌటాల, జనవరి 7: మండలకేంద్రంలోని జాన్వీవిజన్ కేర్ ఆసుపత్రిలో ఆదివారం కౌటాల, చింతలమానేపల్లి, బెజ్జూరు మండలాలకుచెందిన 20మందికి కంటి ఆపరేషన్లు చేయించినట్లు జెఆర్ సర్కార్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ నారాయణ సర్కార్, నేత్రవైద్యాధికారి సీమ సర్కార్ తెలిపారు. ఇటీవల ఆసుపత్రిలో నేత్ర వైద్యశిబిరం నిర్వహించి ఆపరేషన్ అవసరమున్న వారికి కొత్తపేట లయన్స్ క్లబ్ సహకారంతో బెల్లంపల్లిలో కంటిఆపరేషన్‌లు చేయించినట్లు తెలిపారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

బెజ్జూరు, జనవరి 7: బెజ్జూరు గ్రామానికి చెందిన సండె కోటేష్ మృతిచెందడంతో ఆదివారం కాంగ్రెస్ నాయకుడు శ్రీవర్ధన్ మృతుడి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ఆయనవెంట నాయకులు బాబురావు, మురళీ, గంగులు, వినోద్, విష్ణుమూర్తి, శ్రీకాంత్, చంద్రశేఖర్, శ్రీను, హనుమంతు తదితరులున్నారు.